



ఆకలి తీర్చేందుకు వస్తున్నాయ్

ఆగస్టు 15న ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లు

ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురంలో మెరుగులు

ముమ్మిడివరం

ముమ్మిడివరం, ఆగస్టు 7: పేదల ఆకలి తీర్చేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్ ప్రారంభం కానుంది.. ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లో 2019 ఫిబ్రవరి 13న అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. అక్షయ ఫౌండేషన్ ద్వారా రూ.5కే ఉదయం అల్పాహారం, రూ.5కే మధ్యాహ్న భోజనం అందించేవారు. ఈ క్యాంటీనులో రోజుకు 300 నుంచి 350 మంది వరకు పేద ప్రజలు ఆకలి తీర్చుకునేవారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ముమ్మిడివరంలోని అన్న క్యాంటీను భవనం వైసీపీ ప్రభుత్వం వార్డు సచివాలయంగా మార్పు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భవనాన్ని అన్న క్యాంటీన్ నిర్వహణకు తీసుకోవడంతో సచివాలయాలన్ని నగర పంచాయతీ కార్యాలయంలోకి మార్పు చేశారు. రూ.7 లక్షలతో అన్ని హంగులను సమకూరుస్తున్నారు. దాదాపు అన్ని పనులు పూర్తికాగా తుది మెరుగులు దిద్దుకుంటుంది.

రామచంద్రపురం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 7: రామచంద్రపురం పట్టణంలో అన్న క్యాంటీన్ సర్వహంగులతో సిద్ధమయ్యింది. అన్న క్యాంటీన్ భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో పాత బస్టాండ్ పక్కన టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది. 2019 లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రద్దు చేసింది. దీంతో ఆ భవనాన్ని వార్డు సచివాలయంగా మార్పు చేశారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో అన్న క్యాంటీన్లు మళ్లీ తెరుచుకుంటున్నాయి. ప్రభుత్వం ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనుంది. రామచంద్రపురంలో వార్డు సచివాలయాన్ని మార్పు చేసి అన్న క్యాంటీన్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. భోజనాలు, అల్పాహారం స్వీకరించేందుకు గ్రానైట్ బల్లలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. గతంలో మాదిరిగానే ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు చిత్రపటాలు ఏర్పాటు చేశారు.

మండపేట

మండపేట, ఆగస్టు 7: పేదల కడుపు నింపేందుకు కూటమి ప్రభుత్వం ఓ సంక్షేమ కార్యక్రమానికి ఆగస్టు 15న శ్రీకారం చుట్టబోతోంది. తక్కువ ధరకే నాణ్యత కలిగిన ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు ఆ రోజునే ప్రారంభం కానున్నాయి. మండపేట ఏడిద రోడ్డులో వైసీపీ ప్రభుత్వంలో మూతపడ్డ అన్న క్యాంటీన్ ఇప్పుడు కొత్త రూపును సంతరించుకుంది. రూ. 10 లక్షలతో క్యాంటీన్‌కు మెరుగులు దిద్దుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష కట్టి అన్న క్యాంటీన్లను మూసి వేయించారు. ఇది పేదల కడుపుపై కొట్టినట్టయింది. తక్కువ ధరకు భోజనం వస్తుందని ఆనందిస్తున్న పేద, మధ్య తరగతి వారు వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి చాలా ఆవేదన చెందారు. ఇప్పుడు తిరిగి కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తెరుస్తుందనే శుభవార్త విన్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆగస్టు 15న ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

ముమ్మిడివరంలో..



రామచంద్రపురంలో



మండపేటలో





రావులపాలెం మార్కెట్‌లో..

అరటి రైతు ధరహాసం

రావులపాలెం, ఆగస్టు 7: పెళ్లిళ్ల, శుభకార్యాలు, ముహూర్తాలతో పాటు శ్రావణమాసం పర్వదినాలు ప్రారంభం కావడంతో రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు శ్రావణ శోభ సంతరించుకుంది. గత కొంత కాలంగా దిగుబడి ఉన్నప్పటికి సరైన ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెళ్లిళ్ల, శుభకార్యాలు పూజలకు వినియోగించే అరటి ధర రైతులకు ఆశాజనకంగా మారింది. ఆశించిన ధర కంటే అధిక ధర పలుకుతుండటంతో రైతులు ఆనందపడుతున్నారు. అంతర రాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతిగాంచిన రావులపాలెం అరటి మార్కెట్ యార్డు కళకళలాడుతోంది. ప్రస్తుతం వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా కొంత మేర గెలలు దిగుబడి తగ్గినప్పటికి గెలలకు మంచి ధర పలుకుతుండటంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఎగుమతుల ఊపు



శ్రావణమాసం కావడంతో రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో ప్రస్తుతం రోజు 3 వేల నుంచి 14 వేల అరటి గెలలు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ కొనుగోలు చేసిన గెలలు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ, ఒడిసా, శ్రీకాకుళం, విజయనగరం, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, తమిళనాడు, తెలంగాణా ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి. శ్రావణ మాసం సందర్భంగా ఒడిసా రాష్ట్రానికి కర్పూర రకం ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి.

రకం	ఇదివరకు	ప్రస్తుతం
కర్పూర	రూ.150 నుంచి 300	రూ.300 నుంచి 600
చక్రకేళి(తెలుపు)	రూ. 170 నుంచి 300	రూ.200 నుంచి 500
చక్రకేళి(ఎరుపు)	రూ.300 నుంచి 400	రూ.300 నుంచి 600
భూషావళి	రూ.150 నుంచి 300	రూ. 200 నుంచి 350
అమృతపాణి	రూ.200 నుంచి 300	రూ.300 నుంచి 600
కూర అరటి	రూ.150 నుంచి 300	రూ. 200 నుంచి 350

భీమేశ్వరాలయంలో దర్శనాలు

మాణిక్యాంబ అమ్మవారు





7లో

పంచారామ క్షేత్రం ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఏప్రిల్ 24న ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులు నిమిత్తం స్వామివారు, అమ్మవారి గర్భాలయాలను మూసివేశారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు. దీంతో బుధవారం నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులను అనుమతించారు..

వంకాయ ధర పైపైకి

దిగుబడిపై వరదల ప్రభావం

మార్కెట్‌లో ధరల మంట





మండపేట, ఆగస్టు 7: మార్కెట్‌లో వంకాయ ధర చూస్తే కొనేందుకు చెమటలు పడుతున్నాయి. సామాన్య మధ్య తరగతి వారు రేటు చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఏకంగా కిలో రూ.100 దాటటడంతో కంగారుపడుతున్నారు. గోదావరి వరదల నేపథ్యంలో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉద్యానవన పంటలైతే మరీ ఘోరంగా దెబ్బతిన్నాయి. వరద ప్రభావం కూరగాయల దిగుబడిపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా వంకాయలు తక్కువగా మార్కెట్‌కు వస్తున్నాయి. గత నెల వరకు కిలో వంకాయల ధర రూ.25 నుంచి రూ.30 వరకు ఉండగా నేడు వంకాయలు ధర మార్కెట్‌లో కిలో రకాలను బట్టి రూ.60 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. గత కొద్ది రోజుల నుంచి రైతు బజారులో వంకాయల విక్రయాలు నిలిచిపోయాయి. మార్కెట్‌లో వంకాయల ధర బాగా పెరిగిపోవడంతో కొనేవారు లేక మార్కెట్‌కు వంకాయల తీసుకు రావడం మానేసామని వ్యాపారులు చెబుతున్నారు. నల్లవంకాయలు పొడువు రకం కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు. అలాగే తెల్ల వంకాయలు కిలో రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. వంకాయల ధర పెరుగుదలకు పంటలు దెబ్బతినటమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మొత్తం మీద గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్కెట్‌లో వంకాయల ధర కిలో సెంచరీకి చేరటంతో చాలా మంది వంకాయలు లేకుండానే ఇంటికి వెళుతున్నారు.



చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని అమలాపురంలో ర్యాలీ



చేనేత కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చేనేతతో స్వదేశీ ఉద్యమ స్ఫూర్తి

చేనేత సహకార రంగాల అభివృద్ధికి కృషి ● జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ● చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ అమలాపురంలో ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 7: స్వాతంత్రోద్యమంలో స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని నింపిన ఘనత చేనేత కార్మికులకే దక్కుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల కార్మికులతో కలిసి చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ చేపట్టిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. నల్లవంతెన వరకు నిర్వహించిన ర్యాలీలో కార్మికులు, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొని చేనేత వస్త్రాలు ధరిద్దాం.. ప్రకృతిని రక్షించుకుందాం.. వారసత్వ సంపదను కాపాడుకుందాం, ప్రాచీన కళలను కాపాడండి అంటూ ప్లకార్డులు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేత కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సహకార సంఘాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చేనేత కార్మికులను సత్కరించారు. చేనేత సహకార సంఘాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అభివృద్ధి అధికారి మెట్టి గౌరీశంకరరాజు, సహాయ అభివృద్ధి అధికారి ఎ.వెంకటేశ్వరరావు, బండారులంక, హసన్‌బాద చేనేత సహకార సంఘాల మాజీ అధ్యక్షులు పుత్సల వరదరాజులు, దొంతంశెట్టి సత్యప్రకాష్, చేనేత సంఘాల నాయకులు మాడా మాధవి, కాశిన బాబి, ఆశపు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి చేస్తే మార్కెట్ పెరుగుతుంది

ముమ్మిడివరం, ఆగస్టు 7: డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు చేస్తే వాటికి మంచి మార్కెటింగ్ లభిస్తుందని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ముమ్మిడివరం, విలసవిల్లి, కె.జగన్నాథపురం చేనేత సహకార సంఘాలు, ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్‌ను కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించే దిశగా చేనేత సహకార సంఘాలు పనిచేయాలన్నారు. చేనేత కార్మికులు తయారు చేసే ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు చేకూర్చే దిశగా సహకార సంఘాలు కృషి చేయాలన్నారు. స్వదేశీ పరిశ్రమలను, చేనేత కార్మికులను ప్రోత్సహించడానికి జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పలువురు కార్మికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందించి చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా కృషి చేస్తానన్నారు. చేనేత సహకార సంఘాల పనితీరు, చేనేత, జౌళిశాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అభివృద్ధి అధికారి పెద్దిరాజు, ఏడీవో ఎ.వెంకటేశ్వరరావు, సలా గురుమూర్తి, జాబు రాంబాబు, వల్లెం వెంకటరెడ్డి, చింతకింద రామకృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో గీత దాటితే చర్యలు

● శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

● కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని బుధవారం ఆయన ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలను వివరించారు. జిల్లాలోని 1581 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం యాజమాన్య కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల్లో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు హక్కును వినియోగించుకుని కమిటీ సభ్యులను ఎన్నుకోవాలన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి యాజమాన్య కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను కమిటీ సభ్యులు ఎన్నుకోవాలన్నారు. అనంతరం 2 గంటలకు స్కూలు యాజమాన్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతుందని, ఆ తర్వాత కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ ఎన్నికకు ఆయా పంచాయతీల కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పరిశీలకులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.



కంప్యూటర్ ఆపరేటర్‌ను కాటువేసి పాము

కంప్యూటర్ కీబోర్డు కింద పాము

తీస్తుండగా కాటేసిన వైనం

మండపేట, ఆగస్టు 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ చల్లా ఆదిసూర్యనారాయణమూర్తిని బుధవారం పాము కాటేసింది. ఉదయం కార్యాలయానికి వచ్చిన మూర్తి కంప్యూటర్ ఆన్ చేసేందుకు కీబోర్డు తీస్తుండగా దాని కిందే వున్న జెర్రిగొడ్డు అతడి చిటికెను వేలిపై కాటేసింది. వెంటనే అతడు కేకలు వేయడంతో సహచర సిబ్బంది వచ్చి పామును చంపేశారు. ఆ పాము ఐదు అడుగులు పైగా పొడవు ఉంది. మూర్తిని పంచాయతీ సిబ్బంది మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. మూర్తిని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, సహచర కంప్యూటర్ ఆపరేటర్లు చిట్టి, రవి పరామర్శించారు.



వీఆర్ పురం మండలం అన్నవరం చప్టాపై నుంచి కూలీలను దాటిస్తున్న స్థానికులు

పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

వరరామచంద్రాపురం, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. అన్నవరం చప్టాపై ఉదయం 8 గంటల నుంచే వర్షపు నీరు ప్రవహించడం మొదలైంది. చప్టాకు రెండువైపులా పర్లాంగు దూరం వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పనులకు వెళ్లే కూలీలు, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడ్డారు. మొద్దులగూడెం, సీతంపేట మధ్యలో ఉన్న చెరువు అలుగు పైనుంచి వర్షపు నీరు భారీగా ప్రవహించడంతో దాదాపు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి అన్నవరం చప్టా దగ్గర ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చింతూరు: డివిజను పరిధిలోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వరి నాట్లతో పాటు ఇతరత్రా వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ప్రధాన రహదారిపై సోకిలేరు, అత్తాకోడలు వాగు, అన్నవరం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం చింతూరులో వారపు సంతకు నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల కోసం వచ్చిన వారంతా వాగులు దాటి ఇళ్లకు చేరుకున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌బాబు

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం

అన్నవరం, ఆగస్టు 7: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన సత్యదేవుడిని దర్శించుకున్నారు. దేవస్థానం ఉద్యోగులు రమేష్‌బాబుని కలిసి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి బంగారు తాపడం అమరిక పనులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ ధ్వజస్తంభానికి నెల్లూరుకు చెందిన ఒక దాత సుమారు రూ.3కోట్ల వ్యయంతో రాగి రేకుపై బంగారు తాపడం చేయించిన సంగతి విదితమే. నూతన ధ్వజస్తంభాన్ని ఏప్రిల్ నెలలో ప్రతిష్ఠాపన చేయగా బంగారు తాపడం చేయించే ప్రక్రియ పూర్తయ్యింది. గురువారం ఉదయం దాత కొబ్బరికాయ పొట్టి బంగారు తాపడం అమరిక పనులను ప్రారంభిస్తారు.

ఏసీబీ డీఎస్పీగా కిషోర్‌కుమార్



రాజమహేంద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్‌లోని డీఎస్పీ-2గా ఎం.కిషోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఈ రేంజ్ పరిధిలోకి వస్తాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఈస్ట్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఆయన ఏసీబీకి వెళ్లారు.

వరద నీటిలో పడిపోయిన వ్యక్తి

రక్షించిన స్థానికులు



గొల్లప్రోలు, ఆగస్టు 7: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని సూరంపేట చుట్టూ వరద నీరు చేరింది. ఆ ప్రాంతానికి చెందిన కోన సూర్యనారాయణ వరద నీటిని దాటుకుంటూ సూరంపేట వెళ్తుండగా మార్గమధ్యంలో వరద నీటిలో పడిపోయాడు. అతడిని గమనించిన స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఎవరూ గమనించకుంటే తాను ప్రాణాలు కోల్పోయే వాడినని సూర్యనారాయణ చెప్పాడు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి



మృతుడు శివశంకర్

రాజానగరం, ఆగస్టు 7: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గామన్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన ఈడే శివశంకర్ (39) ఐషర్ వ్యానులో విశాఖపట్నం నుంచి విజయవాడ బయల్దేరాడు. మార్గమధ్యంలో గామన్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి టైరు పంక్చర్ కావడంతో వ్యాన్ పక్కకు పెట్టి టైరు మార్చుకుంటున్నాడు. ఆ సమయంలో అదే మార్గంలో విశాఖ నుంచి బాపట్లలోని ఎయిర్‌ఫోర్స్ క్యాంటీన్‌కు కిరాణా వస్తువుల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి శివశంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ షేక్ బడే స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎస్ఐ మనోహర్ సంఘటనాస్థలానికి చేరుకున్నాడు. శివశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నామవరంలో నిశ్చితార్థం రోజున ఫొటో (పాత చిత్రం)

కి'లేడీ'లు

▸▸ డబ్బు కోసం ఘరానా మోసం ▸▸ ఆరుగురు మహిళలపై చీటింగ్ కేసు



వధువుగా నటించిన నీరజ (పాత చిత్రం)

కాకినాడ క్రైం, ఆగస్టు 7: కష్టపడకుండా సులువుగా డబ్బు సంపాదించాలన్న దుర్బుద్ధితో ఏకంగా పెళ్లినే అపహాస్యం చేసిన ఆరుగురు మహిళలపై కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి... కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద మార్కెట్ వీధికి చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ అవివాహితుడు. కాగా అతడి తరపు బంధువులు సంబంధాన్ని కుదిర్చేందుకు శిరీష అనే మధ్యవర్తిని కలిశారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 23న శిరీష అతనికి వధువు తరపున సత్యవేణి, దుర్గ అనే ఇద్దరిని పరిచయం చేసింది. అనంతరం కృష్ణమోహన్‌ను అదేరోజు రాజమహేంద్రవరంలోని నామవరం శాటిలైట్ సిటీకి తీసుకెళ్లి వధువుగా నీరజ అనే యువతిని చూపించారు. వధువు తల్లిగా సత్యదేవి, మేనత్తగా ప్రియాదేవిలను పరిచయం చేశారు. వధువు నచ్చడంతో నిశ్చితార్థం తంతు వెంటనే చేసుకోవాలని నిర్ణయించి వధువుకు ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల నగదు, ఒక ఆండ్రాయిడ్ సెల్‌ఫోను, ఒక బంగారు గొలుసు... మొత్తంగా రూ.5లక్షలు విలువైన సొత్తును వధువు తరఫున వచ్చిన సత్యదేవి, ప్రియాదేవిలకు కృష్ణమోహన్ అందజేశాడు. కొంతకాలం తర్వాత అతడికి అనుమానం వచ్చి వాకబు చేయగా అప్పటికే నీరజకు పెళ్లి అయి సంతానం ఉందని, మధ్యలో వచ్చిన మహిళలు అందరూ మోసానికి పాల్పడ్డవారేనని కృష్ణమోహన్ గుర్తించాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురు మహిళలపై వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 అన్న క్యాంటీన్లు ప్రారంభోత్సవానికి సిద్ధం

▸▸ రెండో విడతలో మరో మూడు క్యాంటీన్లు ▸▸ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్



గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న సుధాకర్

గొల్లప్రోలు, ఆగస్టు 7: ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 33 అన్న క్యాంటీన్ భవనాలు ఈ నెల 15న ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్ వెల్లడించారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. భవనంపై నీరు నిలిచిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్లాబు నీరు కారడాన్ని, వైర్లు వేలాడుతూ ఉండటాన్ని గమనించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ గొల్లప్రోలు పట్టణంతో పాటు అమలాపురం, జంగారెడ్డిగూడెంల్లో క్యాంటీన్లను రెండో విడతలో ప్రారంభిస్తామన్నారు. పలు పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టుల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి శుద్ధి చేసిన నీటిని గొల్లప్రోలుకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తిగా నిలిచిన అర్బన్‌హెల్త్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ హుస్సేన్‌ను ఆదేశించారు.



పడిపోయిన సినిమా చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సినిమా చెట్టును బతికించే ప్రయత్నం చేస్తాం

రోటరీ క్లబ్ సహకారం తీసుకుంటాం... కుమారదేవంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఆగస్టు 7: సినిమా చెట్టు చిగురించేలా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున నేలకొరిగిన సినిమా చెట్టును బుధవారం ఆమె జిల్లా ఫారెస్టు అధికారులు, రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి పరిశీలించారు. 150 సంవత్సరాల వయసున్న నిద్రగన్నేరు చెట్టు దెబ్బతిని రెండుగా చీలి నేలకొరిగింది. రోటరీ క్లబ్ సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పడిపోయిన చెట్టును బతికించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లా టూరిజం కౌన్సిల్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఎఫ్‌వో బి.నాగరాజు మాట్లాడుతూ నేలకొరిగిన చెట్టు ఏపుగా, గుబురుగా పెరిగే వృక్షమన్నారు. ఎండిపోయిన బలమైన కొమ్మలను తొలగించకపోతే కాలక్రమేణా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, గ్రామస్థుల మనోభావాలను కాపాడుతూ అదే చెట్టును సాంకేతికంగా బతికించుకోవడానికి ప్రవాసాంధ్రులు సైతం ముందుకు వస్తున్నారన్నారు. గతంలో 150 సంవత్సరాల చెట్టును ట్రాన్స్‌ప్లాంట్ చేయడాన్ని తాను కూడా చూశానన్నారు. అదే పద్ధతిలో ఈ చెట్టునూ బతికించే అవకాశం ఉందన్నారు. అటవీ శాఖ తరపున సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అజయ్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గన్నమని రాజు, గ్రామస్థులు ఉన్నారు.





కళావాహన అనంతరం భీమేశ్వర స్వామి మూలవిరాట్, హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే

ద్రాక్షారామలో శాస్త్రోక్తంగా కళావాహన...పూజల్లో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు.. భక్తులకు దర్శనాలు ప్రారంభం

ద్రాక్షారామ, ఆగస్టు 7: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను బుధవారం ఉదయం 11.05 గంటల నుంచి అనుమతించారు. మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి గర్భాలయాలను ఏప్రిల్ 24న మూసివేసి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు. మూడు నెలల ఏడు రోజుల అనంతరం భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్‌ల దర్శనం పునః ప్రారంభించారు.

భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి కళావాహనను బుధవారం వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, పునః పూజలు, ఋగ్వేద పారాయణ, గర్భాలయ పూజలు, పరివార దేవతార్చన, కుంభాలు, గో దర్శనం, శాంతి హోమం, పూర్ణాహుతిల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు, ఆయన తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం దంపతులు పాల్గొన్నారు. ఉదయం 9.34 గంటలకు కళావాహన ప్రారంభించి అనంతరం స్వామివారికి జలాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

భీమేశ్వర స్వామి మూలవిరాట్ సంరక్షణ దృష్ట్యా కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు జలాలతోనే అభిషేకం నిర్వహిస్తామని మంత్రి సుభాష్ ప్రకటించారు. ఆలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం దేవస్థానం ఆధ్వర్యంలో తొలి అభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం జలాలతో భీమేశ్వరునికి అభిషేకం జరుపుతారన్నారు. మాణిక్యాంబ అమ్మవారికి పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు. పునః ప్రారంభోత్సవంలో పాల్గొనే అవకాశం రావడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, చింతపల్లి అర్జున్, గుబ్బల యేసురాజు, జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ ఈవో పీటీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సింగన్నగూడెంలో మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణ కమిటీ సభ్యులు

చిన్నారుల మృతిపై విచారణ

చింతూరు, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో పది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందంతో జిల్లా యంత్రాంగం కదిలింది. రెండు రోజుల్లో జరిగిన ఘటనలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ సాధన, చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, చింతూరు సీహెచ్‌సీ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్షతో కూడిన ఒక కమిటీని నియమిం చారు. వీరంతా బుధవారం సింగన్నగూడెం, గంగన్నమెట్ట, బొడ్డుగూడెం గ్రామాల్లోని బాధిత కుటుంబాలను నేరుగా కలిసారు. చిన్నారుల తల్లిదండ్రులతో జరిగిన ఘటనలపై ఆరా తీశాక వాగులు ఉధృతిగా వున్న కారణంగా చదలవాడ, వంకగూడెం గ్రామాలకు వెళ్లలేదని వారు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు.

శ్వాసకోస ఇబ్బందితో మరో బాలుడు ఆసుపత్రిపాలు



చింతూరు, ఆగస్టు 7: సరిహద్దు రాష్ట్రమైన ఒడిసాలోని మల్కన్‌గిరి జిల్లా చిన్నమదుగూరుకు చెందిన పవన్ శ్వాస పీల్చుకోడంలో ఇబ్బందిపడుతున్నాడు. దీంతో అతడి తల్లిదండ్రులు కొవ్వాసి దూలయ్య-రాజమ్మ గ్రామంలోని ఓ నాటు వైద్యుడిని మంగళవారం ఆశ్రయించారు. అతడు ఇచ్చిన చెట్టు మందుని కుమారుడికి పట్టించారు. బుధవారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో చింతూరు సీహెచ్‌సీకి తీసుకురాగా సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో పవన్‌కి ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: న్యాయం చేయాలని ఒక వివాహిత తన కుమారుడితో కలిసి సుమారు రెండు గంటల పాటు వర్షంతో అత్తింటి ఎదుట వద్ద బుధవారం దీక్షకు దిగింది. దీంతో ఆమె భర్త, అత్తమామలు ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. బాధితురాలి కథనం ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన రేష్మాకు రాజేంద్రనగర్ వడ్డీల వీధికి చెందిన హబీబ్ బాషాతో 2012



దీక్ష చేస్తున్న రేష్మాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ చిట్టిబాబు



న్యాయ పోరాటం

▸▸ అత్తింటి ఎదుట కుమారుడితో కలిసి వివాహిత దీక్ష

▸▸ అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

అక్టోబరు 21న వివాహం జరిగింది. పెళ్లయిన పది రోజులకే అదనపు కట్నం కోసం వేధింపులు ఆరంభమయ్యాయి. 2013లో బాబు పుట్టాడు. ఆ తర్వాత ఇల్లు కట్టుకుందామని చెప్పి బంగారు మొత్తం తీసుకుని పుట్టింటి వద్ద వదిలేశాడు. ఎన్నిసార్లు ఇంటికి వచ్చినా బయటకు గెంటేసేవాడు. దీంతో 2016లో బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోర్టులో కేసు వేయగా 2023లో అనుకూలంగా తీర్పు వచ్చింది. రేష్మాతో పాటు కుమారుడుని భర్త చూసుకోవాలని, నెలకు రూ.16 వేలు ఇచ్చి ఇంట్లో పెట్టుకోవాలని లేదా ఇల్లు అద్దెకు తీసిపెట్టాలని కోర్టు చెప్పినా హబీబ్ పట్టించుకోలేదు. 'నా తండ్రి కువైట్‌లో పనిచేస్తూ 2021లో కొవిడ్‌తో మరణించాడు. నాకు ఏ దిక్కూ లేదు. కుమారుడిని పెంచడం చాలా కష్టంగా ఉంది. నా భర్తకు వేరే పెళ్లి చేయడానికి తండ్రి, తల్లి, ఆడపడుచు ప్రయత్నాలు చేస్తున్నారని రేష్మా చెప్పింది. అమ్మాయిలతో గోవాలో తిరుగుతున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఫొటోలను మీడియాకు అందజేసింది. తనను ఏలుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే దారి కనిపించట్లేదని కన్నీరు పెట్టుకుంది. స్థానిక మహిళలు ఆమెకు అండగా నిలిచారు. బాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించారు. మాజీ కార్పొరేటర్ నక్కా చిట్టిబాబును పంపి బాధితురాలితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. న్యాయం చేస్తామని, దీక్ష విరమించాలని సూచించారు. న్యాయం జరిగే వరకు అత్తింటి వరండాలోనే తాను ఉంటానని రేష్మా చెప్పింది. దీంతో భర్త, అత్తమామలను ఇంటికే పిలిపించి సమస్యను ఎమ్మెల్యే వద్ద పెట్టి న్యాయం చేస్తామని చిట్టిబాబు చెప్పారు.

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- ఘనంగా అంతర్జాతీయ చేనేత దినోత్సవం
- సీనియర్ చేనేత కార్మికులకు సన్మానం

అధ్యాపకుడు కోలాకు పీహెచ్‌డీ

మండపేట, ఆగస్టు 7: స్థానిక జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థి, నక్కపల్లి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కోలా శ్రీమనారాయణ విశాఖ గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీ పొందారు.మండపేటలో బుధవారం సహచరపూర్వ విద్యార్థులు ఆయనను సత్కరించారు. బేరియం, కాల్షియం, జిర్కోనియం వంటి పలు అంశాలపై చేసిన పరిశోధనలకు ఆయనకు పీహెచ్‌డీ వచ్చింది. మేకా నాగరాజు, మేకా రామకృష్ణ, బండారు శ్రీరామచంద్రమూర్తి, రాగాల వెంకటర మణ, నెక్కంటి శ్రీనివాసరావు, అందే సత్యనారాయణ పాల్గొన్నారు.

పనిచేయని అధికారులు బదిలీపై వెళ్లిపోండి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, ఆగస్టు 7: విధులు పట్ల అలసత్వంగా ఉండి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా పనిచేసే అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈసందర్భంగా శాఖల వారీగా అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా అధికారులు పనిచేయాలని, ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి నేతలకు తెలియజేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామ న్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వచ్చే సమావేశంలోపు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గంగలకుర్రు నుంచి గంగలకుర్రు అగ్రహారం వచ్చే పంటబోదెను కొందనే ఆక్రమించుకున్నా పట్టించకోవడంలేదని ఇరిగేషన్ అధికారులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు నిలదీశారు. ఇటీవల ఒక ఇంటి మరుగుదొడ్డి ఫైపు గొట్టాలు పంటబోదెలకు పెట్టిన్నట్లు పంచాయతీ ద్వారా లేఖను అందించినా పట్టించుకోలేదన్నారు. దీనిపై ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ మాట్లాడుతూ గంగలకుర్రు అగ్రహారం పరిధిలో ఆయకట్టు లేదన్నారు. అయితే ఆ గ్రామంలో 40ఎకరాలు సాగుచేస్తున్నారని ఈకాలువ ద్వారా సాగునీరు వస్తుందని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్‌చేశారు.ప్రజాప్రతినిధులందరూ విద్యుత్ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావడంతో విద్యుత్‌శాఖ అధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయడం ఇష్టం లేకపోతే ఇక్కడ నుంచి వెళ్లిపోండని హెచ్చరించారు. ముక్కామల పీహెచ్‌సీని పుల్లేటికుర్రులో నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్‌కు మార్పు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ జల్లి బాలరాజు కోరారు. ఎంపీడీవో జీవీ సరోవర్, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఇన్‌చార్జ్ తహసీల్దారు నాగపద్మలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెంగ్యూ నిర్ధారణకు అందుబాటులో ఎలీసా పరీక్ష

అమలాపురం రూరల్, ఆగస్టు7: డెంగ్యూ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నవారు వ్యాధి నిర్ధారణ కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఎలీసా పరీక్ష అందుబాటులో ఉందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర చెప్పారు. ఎలీసా పరీక్షలో డెంగ్యూ వ్యాధిగా నిర్ధారణ అయితే ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచిత వైద్యం పొందవచ్చునన్నారు. పేరూరు శివారు కొంకాపల్లిలో జ్వరపీడితుల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంతో బుధవారం వైద్య సిబ్బందితో కలిసి ఆయన ఆ ప్రాంతంలో పర్యటించారు. పేరూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బీవీసత్యం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని కొనసాగించారు. మరో ఇద్దరు జ్వర పీడితులను గుర్తించడంతో వైద్య సేవలను ముమ్మరం చేయడంతో పాటు సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. డెంగ్యూ లక్షణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న తూము దొరబాబు బుధవారం ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు మార్చారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో చెప్పారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, తాగి పడేసిన గ్లాసుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఫ్రిజ్‌లు, కూలర్లలో ఎప్పటికప్పుడు నీటిని తీసివేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు ఆధ్వర్యంలో కొంకాపల్లి పరిసర ప్రాంతల్లో దోమల నివారణకు విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించడంతో పాటు సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టారు.



కొంకాపల్లిలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

వెంకన్న ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న మల్లాడి తదితరులు

యానాం, ఆగస్టు7: యానాం శ్రీభూమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి. మొదటి దశలో రూ.6కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం, నిధులు, యానాం భక్తుల సహకారంతో పనులు పునాది స్థాయివరకు జరిగాయి. ఆలయం రాతి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. తమిళనాడులోని మహాబలిపురం నుంచి చెక్కిన రాళ్లు యానానికి చేరుకున్న విషయం తెలిసిందే. బుధవారం ఉదయం ఆలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, ఆలయ పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాతి నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని, నిర్మాణ పనులకు తనతో పాటు పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధులు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, కాపగంటి ఉమాశంకర్, మంచాల సత్యసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు

అంబాజీపేట, ఆగస్టు7: రైతులు ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలుపడించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు సూచించారు. వక్కలంకలో గుత్తుల ధర్మారావు పొలంలో ప్రకృతి వ్యవసాయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం కోసం అవలంభించే పద్ధతులను బోసుబాబు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బోసుబాబు మాట్లాడుతూప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బందికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, వ్యవసాయవిభాగ అధికారిని ఆర్.రాధిక, మాస్టర్ ట్రైనర్ జె.నాగమణి, ప్రకృతి వ్యవసాయం ఏవో శ్రీనివాస్, వీఏఏ సౌజన్య పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా వస్తున్న చేపలు

మామిడికుదురు, ఆగస్టు7: తాగునీటిలో చేపలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడికుదురు గ్రామంలోని పశువుల ఆసుపత్రి ప్రాంతంలో, శివాలయం ప్రాంతంలో బుధవారం మంచినీటి కుళాయి ద్వారా చేప పిల్లలు వచ్చినట్టు ప్రజలు తెలిపారు. గతంలో కూడా చేప పిల్లలు వచ్చాయని స్థానికులు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ పైపులైనుకు లీకేజీ ఏర్పడడంతో చేప పిల్లలు వస్తున్నట్టు స్థానికులు అంటున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేతన్నకు అండగా ఎన్డీయే ప్రభుత్వం

అంతర్వేది, ఆగస్టు7: నేతన్నకు అండగా ఎన్డీయే ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరి చేనేత సొసైటీ రూ.86లక్షల్లో నష్టాల్లో ఉందని, దానిని ఏవిధంగా అధిగమించాలనేదానిపై కార్యాచరణ చేపడతామన్నారు. గతంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఆయన కార్మికులకు తెలియచేశారు. చేనేత దినోత్సవం సందర్భంగా మోరి చేనేత సొసైటీలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దేవ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేత కార్మిక పెద్దలైన బళ్ల శ్రీశైలం, పిచ్చిక సత్యనారాయణ, గుమ్మిడి త్రిమూర్తులును ఎమ్మెల్యే దేవ సన్మానించారు. అనంతరం సొసైటీ సభ్యులు రాజోలు ఎమ్మెల్యే దేవ ను ఘనంగా సన్మానించారు. ప్రతీ నేత కార్మికునికి ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి కృషి చేస్తామని దేవ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కొండా శివయ్య, బూసిం బాబూరావు, బళ్ల లింగంమూర్తి, కొండా సత్యనారాయణ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, రాపాక నవరత్నం, కాండ్రేగుల రాము, కడలి వెంకటరత్నం, కౌరు శ్రీనివాస్, కూటమి శ్రేణులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేది: చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దేవ

చేనేత కార్మికులకు ఘన సన్మానం

అయినవిల్లి, ఆగస్టు 7: కె.జగన్నాథపురంలో చేనేత సొసైటీ వద్ద బుధవారం చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేశామన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతన్నారు. అనంతరం చేనేత కార్మికులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మిద్దే రవిరాజ్, యనమదల వెంకటరమణ, మల్లాది మల్లిబాబు మాస్టారు, డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ అంకం వీర్రాజు, సొసైటీ మాజీ సెక్రటరీ పిచ్చిక చినపల్లంరాజు, సీనియర్ చేనేత కార్మికులు కట్టా శ్రణయ్య, చేనేత సొసైటీ స్టాఫ్ ఉప్పిగంటి శ్రీనివాస్, బాసిన మల్లేశ్వరరావు, శీలం కిట్టయ్య, నక్కిన సత్యనారాయణ, కారుపర్తి సత్తిబాబు, గొలకోటి కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

ద్రాక్షారామ, ఆగస్టు 7: అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం హసన్‌బాదలో ఘనంగా నిర్వహించారు. చేనేత సహకార సంఘాల అభివృద్ధికి దివంగత దొంతంశెట్టి విరూపాక్షం విశేష కృషిచేశారని వక్తలు కొనియాడారు. తాటిపర్తి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పారావును ఘనంగా సత్కరించారు. అలాగే సంఘ సీనియర్ సభ్యులు ఐదుగురు దంపతులను చేనేత సహకార సంఘాల నాయకులు సత్కరించారు. దొంతంశెట్టి విరూపాక్షం విగ్రహానికి జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, దొంతంశెట్టి సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

మంత్రికి చేనేత పట్టువస్త్రం అందజేత

అంతర్జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని శివలకు చెందిన చేనేత కార్మికుడు అల్లం వీరబ్రహ్మం స్వయంగా నేసిన చేనేత పట్టువస్త్రాన్ని బుధవారం మంత్రి సుభాష్‌కు అందజేశారు. గత ప్రభుత్వంలో చేనేత రంగం ఏవిధంగా నష్టపోయిందో మంత్రికి వివరించారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

రాయవరం, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన చేనేత కార్మికులు నక్కిన తమ్మారావు, పద్మావతి దంపతులను బీజేపీ నాయకులు దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాకా దుర్గా శ్రీనివాస్, లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, చిటర్ల సుబ్బారావు, చేనేత సంస్థ మాజీ ఉపాధ్యక్షుడు ఆండ్ర బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

అమలాపురంరూరల్, ఆగస్టు7: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం బండారులంకలో చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి ఆధ్వర్యంలో దశాబ్దాల కాలంగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల దంపతులను సత్కరించారు. బీజేపీ నాయకులు బేబీరాణి, చిట్టూరి రాజేశ్వరి, ఎం.ఆదిలక్ష్మి, కె.కోకిల, డి.భవానీ, జనసేన నాయకుడు బట్టు పండు, టీడీపీ నాయకులు ఆశపు చిన్ని, కాశిన బాబి, చేనేత సెల్ కన్వీనర్ సోరపల్లి పద్మినీకుమార్, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, ఆగస్టు 7: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. 11కేవీ కొత్తలంక ఫీడర్‌పై ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం, రాజుపాలెం, నడిమిలంక, మండలంలో గాడిలంక, అన్నంపల్లి, గేదెల్లంక, కొమనాపల్లి, గోదశివారిపాలెం, కొత్తలంక, చినకొత్తలంక, కర్రివానిరేవు గ్రామాల్లో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రాయవరం: 33బై11కేవీ,33కేవీ రామచంద్రపురం నుంచిరాయవరం, ఏడిద ఫీడర్లులైన్లు మరమ్మతు పనులు కారణంగా గురువారం ఉదయం8నుంచి మధాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ తెలిపారు. సోమేశ్వరం, మాచవరం, లొల్ల, పసలపూడి, ఎర్రమట్టిపురం, రామచంద్రపురం మండలం కొత్తూరుతో పాటు పలు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కపిలేశ్వరపురం: వెదురుమూడి సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు కారణంగా గురువారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఈఈ విజయానంద్ తెలిపారు. అంగర, టేకి, మాచరమట్లలు, శ్రీరాపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

గవర్నర్‌గా కైలాష్‌నాథాన్ బాధ్యతలు స్వీకరణ



యానాం, ఆగస్టు 7: పుదుచ్చేరి గవర్నర్‌గా కైలాష్‌నాథాన్ బుధవారం ఉదయం 11.20గంటలకు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరిలోని రాజ్‌నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రధాన న్యాయమూర్తి కైలాష్‌నాథాన్‌తో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్‌ను సీఎం ఎన్.రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శాలువాలతో సత్కరించారు. అనంతరం గవర్నర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా రాజోలును తీర్చిదిద్దుతా



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిషేధంపై బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ, నాయకులు

అంతర్వేది, ఆగస్టు 7: ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా రాజోలు ప్రాంతాన్ని తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే దేవస్వామిని దర్శించుకున్న ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ గోపురం ఎదురుగా ప్లాస్టిక్ నిషేధంపై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. దేవస్థానం పంచాయతీ సిబ్బంది సేకరించిన ప్లాస్టిక్ డబ్బాలను కొనుగోలు చేశారు. ఈసందర్భంగా దేవ మాట్లాడుతూ మలికిపురం మండలం తూర్పుపాలెంలో పారిశ్రామికవేత్త అడబాల ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రీసైక్లింగ్ పరిశ్రమకు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను పంపిస్తామన్నారు. కిలో రూ.7చొప్పున ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రభాకరరావు కొనుగోలు చేస్తారన్నారు. రాజోలు దీవిలో ఉన్న 60గ్రామ పంచాయతీల్లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను ఆధునికీకరించి వాటి ద్వారా వచ్చే ప్లాస్టిక్‌ను ఈపరిశ్రమకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, పోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉండపల్లి అంజి, ఎంపీటీసీ బైరా నాగరాజు, పోతురాజు సురేష్, కౌరు శ్రీను, సర్పంచ్‌లు పోతురాజు కిశోర్, దెందుకూరి వెంకటశ్రీహరిరాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటండి

అంతర్వేది, ఆగస్టు 7: ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ పోతురాజు కిశోర్, పోతురాజు కృష్ణ, ఆలయ సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

4,529 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం



పాశర్లపూడిలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

అమలాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి)/మామిడికుదురు: పాశర్లపూడిలో రెండు ప్రాంతాల్లో విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పాశర్లపూడికి చెందిన తోట సుబ్బారావు గోదామును తనిఖీ చేశారు. రూ.84,175 విలువైన 1850కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈబియ్యాన్ని నిల్వ ఉంచిన గ్రామానికి చెందిన బొరుసు మురళీకృష్ణతో పాటు గోదాము యజమాని తోట సుబ్బారావుపై కేసు నమోదు చేశారు. పాశర్లపూడి కొండాలమ్మ సెంటర్‌లోని రమా ట్రేడర్స్‌ను తనిఖీ చేశారు. రూ.1,21,894 విలువైన2,679కిలోల (104బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ట్రేడర్స్ యజమాని తోట భవన్నారాయణపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్‌ఐ టి.జగన్నాధరెడ్డి, వ్యవసాయ అధికారి ఎ.భార్గవ మహేష్, హెచ్‌సీ డి.జీవానంద్, జి.వి.ఎస్.లోవరాజు, ఎస్‌కే వలీ పాల్గొన్నారు.

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 7: ప్రతీనెల18న సచివాలయాల్లో గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలను అందజేస్తున్నట్లు అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో జె.మల్లికార్జునుడు తెలిపారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-4లో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు7: రామచంద్రపురంలో లోవోల్టేజీ సమస్యను అరికట్టేందుకు మంత్రి సుభాష్ ఆదేశాలతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రత్నంపేటలో63కేవీ డీటీఆర్, చప్పిడివారిసావరంలో 100 కేవీఏ డీటీఆర్‌లు ఏర్పాటుచేశారు. వీటిని మంత్రి సుభాష్ తండ్రి సత్యం ప్రారంభించారు. ఏఈ మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి సేవలు ప్రశంసనీయం

కె.గంగవరం, ఆగస్టు 7: ఉపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో తులసి రాజరాజేశ్వరి చేసిన సేవలు ప్రశంసనీయమని ఎంఈవో1 ఏ.నాగరాజు అన్నారు. కోటిపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రాజరాజేశ్వరి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆమెను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు కర్రి గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు మేడిశెట్టి పుల్లయ్య, చిట్టూరి రామ్మోహన్‌రావు, దాసరి శ్రీను పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం, ఆగస్టు 7: కె.గంగవరంలోని వైష్ణవి కనకదుర్గా ఆలయంలో అమ్మవారి విగ్రహం, ఆలయ శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమ్యాయి.బుధవారం స్వస్తివాచకం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ప్రతిష్ఠా సంకల్పం, దీక్షాదారణ, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు.

స్టడీమెటీరియల్ పంపిణీ

అంబాజీపేట, ఆగస్టు7: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం 2004లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు రూ.40వేలు విలువైన స్టడీమెటీరియల్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈపుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని పూర్వపు విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కడలి సాయిరామ్, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణా తరగతులు

అమలాపురంరూరల్, ఆగస్టు7: సంపూర్ణ పారిశుధ్యం, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలతో పాటు ఎల్‌ఈడీ లైట్లు, గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు అంశాలపై ఈనెల12నుంచి మూడు రోజులు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తెలిపారు. జిల్లాపరిషత్ సీఈవో ఆదేశాలతో సర్పంచ్‌లు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, అధికారాలపై శిక్షణ

పి.గన్నవరం, ఆగస్టు7: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 13,14,15 తేదీల్లో గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, అధికారాలు, లక్ష్యాలపై పునఃశిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. సర్పంచ్‌లతో పాటు గ్రేడ్ 1 నుంచి గ్రేడ్-5 వరకు కార్యదర్శులు పాల్గొంటారన్నారు. గ్రామపంచాయితీల ద్వారా లేఅవు ట్లు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్రమణలు తొలగింపు, ప్రభుత్వ గ్రాంట్లు, 15వ ఆర్థిక సంఘం నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

నామన ఫౌండేషన్ చేయూత

పి.గన్నవరం, ఆగస్టు 7: వరదల్లో జరిగిన పడవ ప్రమాదంలో యువకుడు విజయకృష్ణ మృతిచెందగా నామన ఫౌండేషన్ ద్వారా రూ.5వేల చెక్కును ఆ కుటుంబానికి నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, నిమ్మకాయల శేషారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

ముమ్మిడివరం, ఆగస్టు 7: యువతిని మోసంచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. కమిని పంచాయతీ పరిధిలోని వలసలతిప్ప గ్రామానికి చెందిన గుత్తాల హేమలత భర్త నుంచి విడిపోయి పుట్టింట్లో ఉంటుంది. అదేగ్రామానికి చెందిన ఎలిపే రాధాకృష్ణ ప్రేమిస్తున్నానని ఆమెను నమ్మించి మోసం చేశాడు. పెద్దల్లో పంచాయతీ పెట్టారు. రామకృష్ణ పెళ్లికి నిరాకరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులు నిర్వహించిన తిరునక్షత్ర ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఆండాళ్ అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం రాత్రి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయంలో ప్రాకారోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,42,935 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

10న యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 7: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల10న అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించనున్నట్టు జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా రాష్ట్ర విద్యా సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈసమావేశానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ), మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడతారు. విద్యా సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసుతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని యూటీఎఫ్ కార్యకర్తలంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని చూడి ఆవు మృతి

అంబాజీపేట,ఆగస్టు7: స్థానిక పశువుల ఆసుపత్రి సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొని చూడి ఆవు మృతిచెందింది. సత్యసాయినగర్‌లో చూడి ఆవును వీధికుక్కలు వెంటబడటంతో ఆవు ప్రధాన రహదారిపైకి వెళ్లింది. రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది.

పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీ

ముమ్మిడివరం, ఆగస్టు 7: ముమ్మిడివరం జడ్పీ బాలికల జూనియర్ కళాశాల (హైస్కూలు ప్లస్)లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు బుధవారం హెచ్‌ఎం సీహెచ్ పరిమళ పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శివం భజే
శ్రీలలిత	: తిరగబడరా సామి
శేఖర్ స్క్రీన్-1	: బడ్డీ
శేఖర్ స్క్రీన్-2	: అలనాటి రామచంద్రుడు
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

ఆలమూరు ఎస్‌ఐగా అశోక్ బాధ్యతలు స్వీకరణ



ఆలమూరు, ఆగస్టు7: ఆలమూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం ఎం.అశోక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొత్తపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తాననన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానని అశోక్ చెప్పారు. ఎస్‌ఐ అశోక్‌ను సిబ్బంది, నాయకులు అభినందించారు. ఇక్కడ పనిచేసిన ఎల్.శ్రీనునాయక్‌ను వీఆర్‌లో ఉంచారు.

కొత్తపేట ఎస్‌ఐగా సురేంద్ర



కొత్తపేట,ఆగస్టు7: కొత్తపేట ఎస్‌ఐగా జి.సురేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ద్రాక్షారామ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ఎం.అశోక్ ఆలమూరు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలపై దృష్టి పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మామిడికుదురు ఎస్‌ఐగా చైతన్యకుమార్

మామిడికుదురు, ఆగస్టు 7: నగరం పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా ఎ.చైతన్యకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండపేట రూరల్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఎస్‌ఐకు సిబ్బంది, మహిళా పోలీసులు స్వాగతం పలికారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటానని, అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన సురేష్ మలికిపురం బదిలీపై వెళ్లారు.

రాజోలు ఎస్‌ఐగా రాజేష్‌కుమార్



రాజోలు, ఆగస్టు 7: రాజోలు ఎస్‌ఐగా బి.రాజేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అయినవిల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

రామచంద్రపురం సీఐగా ప్రకాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 7: రామచంద్రపురం సీఐగా కడియాల అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం స్పెషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీఐ అశోక్ మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ద్రాక్షారామ ఎస్‌ఐగా ఎం.లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మండపేట రూరల్ ఎస్‌ఐగా సురేష్‌కుమార్



మండపేట, ఆగస్టు 7: మండపేట మండల రూరల్ ఎస్‌ఐగా డి.సురేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముమ్మిడివరం ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు సహకారంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ చైతన్యకుమార్ మలికిపురం బదిలీ అయ్యారు.

ఆలయంలో ఆర్డీవో పూజలు

అంతర్వేది, ఆగస్టు7: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

డీలర్లకు రూ.7,500 గౌరవ వేతనం చెల్లించాలి

మామిడికుదురు, ఆగస్టు7: రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న డీలర్లకు గౌరవ వేతనంకింద రూ.7,500 చెల్లించాలని వారు కోరారు. డీలర్ల వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి బుధవారం నగరం ఏఎంసీ గోడౌన్ల వద్ద డీలర్లు మామిడికుదురు, మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాలకు చెందిన డీలర్లు పాలాభిషేకం చేశారు. డీలర్లకు ఇచ్చే క్వింటాలు బియ్యం బస్తాకు కమిషన్‌ను రూ.100నుంచి రూ.150కు పెంచాలన్నారు.

తాగునీటి కుళాయి పల్స్ సర్వే చేయాలి

అల్లవరం, ఆగస్టు 7: తాగునీటి కుళాయిల విషయంలో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పల్స్ సర్వే చేయాలని ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో యజమాని పేరు నమోదుచేసి కుళాయిలు ఉన్నదిలేనిది నమోదు చేయాలన్నారు.

అమ్మల లాలనకు ప్రత్యేక గది ఏర్పాటు

అంబాజీపేట,ఆగస్టు7: తల్లులు పిల్లలకు పాలు ఇచ్చేందుకు స్థానిక స్త్రీల ఆసుపత్రిలో ప్రత్యేకంగా గదిని అమ్మల లాలన పేరుతో బుధవారం ఏర్పాటు చేసినట్లు సీఈవోడా.హెవార్డురాజు తెలిపారు.